జంక్షన్.. టెన్షన్

జాతీయ రహదారి దాటాలంటే హడల్

తరచూ ప్రమాదాలతో భయం భయం!

జాతీయ రహదారిపై పలు జంక్షన్లు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. సిగ్నళ్లు అలంకార ప్రాయంగా మిగిలి పోవడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు సరైన ఏర్పాట్లు లేకపోవడంతో వాహన చోదకులకు దడ పుట్టిస్తున్నాయి. దీంతో ఆ జంక్షన్లు దాటితే హమ్మయ్యా అనే పరిస్థితి కనిపిస్తోంది. లంకెలపాలెం మొదలుకొని షీలానగర్ వరకు నిత్యం ఏదో ఒక ప్రమాదం జరగడంతో ఈ ప్రాంతవాసులు ఆందోళన చెందుతున్నారు. అయినప్పటికీ సంబంధిత యంత్రాంగం నియంత్రణ చర్యలు తీసుకోవడం లేదు.

– గాజువాక



ఆటోనగర్ జంక్షన్



జగ్గు జంక్షన్ వద్ద పని చేయని సిగ్నళ్లు

జగ్గు జంక్షన్

జగ్గు జంక్షన్‌లో తరచూ జరుగుతున్న **ప్రమాదాలు స్థానికులను** కలవరానికి గురి చేస్తున్నాయి. **ఈ సర్కిల్‌లో** ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి **నప్పటికీ పని చేసిన దాఖలాలు** అరుదు. ఎటు నుంచి **వాహనాలు దూసుకొస్తాయో** తెలియని పరిస్థితి **వాహనచోదకులను** భయపెడుతోంది. ఈ **సర్కిల్‌వద్ద ప్రమాదాలు** చోటుచేసుకొంటున్నాయి.

వడ్లపూడి జంక్షన్

జాతీయ రహదారిలో ఫ్లై ఓవర్ దిగగానే వచ్చే కూడలి ఇది. దీంతో వాహనాలు వేగంగా దూసుకువస్తుంటాయి. కణితి, వడ్లపూడి పరిసర 18 కాలనీలకు చెందినవారితో పాటు, స్టీల్‌ప్లాంట్, కూర్మన్నపాలెం, అగనంపూడివైపు వెళ్లేందుకు ఈ కూడలి మీదగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఆటోనగర్ పరిశ్రమల నుంచి వచ్చే భారీ వాహనాలు ఈ కూడలి వద్దే హైవేపైకి రాకపోకలు సాగిస్తాయి. ఇక్కడ పోలీసు పర్యవేక్షణ బలహీనంగా ఉంది. ట్రాఫిక్ సిగ్నళ్ల వ్యవస్థ కూడా అలంకార ప్రాయంగా మారిపోవడంతో తరచూ ఇబ్బందికర పరిణామాలు చోటు చేసుకొంటున్నాయి.

చినగంట్యాడ జంక్షన్

జాతీయ రహదారి నుంచి సుమారు 12 కాలనీలకు వెళ్లేందుకు అనుసంధానమైన జంక్షన్ ఇది. ఒక పక్క పాతగాజువాక నుంచి, మరోపక్క చినగంట్యాడ ఈసేవా రోడ్డు నుంచి ఒకేసారి వాహనాలు వస్తుండడంతో జంక్షన్‌లో గందరగోళ పరిస్థితులు ఏర్పడుతుంటాయి. రోజూ వేలాది మంది రాకపోకలు సాగించే ఈ జంక్షన్‌లో ట్రాఫిక్ కష్టాలు పద్మవ్యూహాన్ని తలపిస్తాయి. నివాస ప్రాంతాల నుంచి జాతీయ రహదారి దాటాలను కొనేవారు కనీసం 10 నిమిషాలైనా ఆగక తప్పడంలేదు. ఇక్కడ కనీసం హెచ్చరిక సిగ్నల్ కూడా లేకపోవడంతో వాహనాలు వేగంగా దూసుకుపోతుంటాయి.

శ్రీనగర్ జంక్షన్

గాజువాకలో ప్రధానమైన జంక్షన్లలో శ్రీనగర్ ఒకటి. ఇక్కడ ప్రమాదాలు నిత్యకృత్యంగా మారాయి. గాజువాక ఆటోనగర్ నుంచి అటు విజయవాడ వైపు వెళ్లడానికైనా, ఇటు శ్రీకాకుళం, భువనేశ్వర్ వైపు వెళ్లే భారీ వాహనాలు వచ్చే జంక్షన్ ఇది. ఆటోనగర్‌లోకి వెళ్లే భారీ వాహనం జంక్షన్‌లో ఆగిపోతే గాజువాక మొత్తం ట్రాఫిక్ స్తంభించిపోయిన దాఖలాలున్నాయి. ఇంతటి ప్రాధాన్యంగల జంక్షన్‌లో సిగ్నళ్లు పని చేయని దుస్థితి నెలకొంది.

ప్రమాదకరం.. కూర్మన్నపాలెం

జాతీయ రహదారిపై కూర్మన్నపాలెం జంక్షన్ అత్యంత ప్రమాదకరంగా మారిపోయింది. ఆర్టీసీ డిపోకి సమీపంలో జాతీయ రహదారి దాటాలంటే ప్రాణాలను అరిచేతుల్లో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రోడ్డు దాటుతుండగా లారీ ఢీకొనడంతో ఇక్కడ ఇద్దరు యువకులు ఇటీవల దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదం జరిగిన రెండు రోజుల పాటు పోలీసులు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టినప్పటికీ మళ్లీ పాత పరిస్థితే కనిపిస్తోంది.

ఆటోనగర్ జంక్షన్

ఆటోనగర్ లోపల నుంచి జాతీయ రహదారికి అనుసంధానమై ఉన్న ఈ జంక్షన్‌ను ప్రమాదకర జంక్షన్‌గా మారింది. జాతీయ రహదారి నుంచి ఆటోనగర్ లోపలికి, అటు నుంచి జాతీయ రహదారిపైకి భారీ వాహనాలు అధిక సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ సిగ్నల్ వ్యవస్థ సరిగా లేకపోవడంతో వాహనాల రాకపోకలు కూడా గందరగోళంగా మారుతున్నాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. ఇక్కడ ఎక్కువగా ద్విచక్ర వాహనాచోదకులు ప్రమాదాల భారిన పడుతున్నారు. సిగ్నల్ వ్యవస్థ పక్కాగా పని చేసే విధంగా చర్యలు చేపట్టాలని వాహనచోదకులు కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

విశాఖ డెయిరీ జంక్షన్

ఈ జంక్షన్ వద్ద సిగ్నల్ లైట్లు లేకపోవడం ప్రధాన సమస్య. ఇటు డెయిరీతోపాటు జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న తూనిక యంత్రానికి వచ్చే భారీ వాహనాల నియంత్రణకు చర్యలు లేవు. దీనివల్ల ప్రమాదాలు చోటు చేసుకొంటున్నాయి. బీహెచ్‌పీవీ కార్మికులు, టౌన్‌షిప్‌కు వెళ్లేవారితోపాటు విశాఖ డెయిరీకి వచ్చేవారు, పాలవ్యాన్లు ఇక్కడే మలుపు తిరుగుతాయి. మింది, రామ్‌నగర్, జింక్ వైపు వెళ్లేవారు కూడా బీహెచ్‌పీవీ కూడలి వద్ద ఇబ్బందుల దృష్ట్యా ఇక్కడి నుంచే డైవర్షన్ తీసుకుంటారు. నియంత్రించేందుకు పోలీసులు ఉండరు.

ఇలా చేస్తే కొంతమేలు

ప్రమాదాల తీవ్రత దృష్ట్యా ఈ జంక్షన్లలో రాత్రిపూట విద్యుద్దీపాలు పని చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. జంక్షన్ల వద్ద అప్రోచ్‌లను ఆనుకొని వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలి. జాతీయ రహదారిపై బస్టాప్‌ల వద్ద లారీల పార్కింగ్ లేకుండా చర్యలు తీసుకోవాలి. ప్రమాదాలను అరికట్టడం కోసం ఎక్కడికక్కడ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. నాతయ్యపాలెం, శ్రీనగర్ వంటి ప్రాంతాల్లో జాతీయ రహదారిపై లారీలు, భారీ వాహనాల పార్కింగ్ లేకుండా చూడాలి.

క్లుప్తంగా

ఘనంగా అన్నమయ్య జయంతి



పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న భక్తులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 65వ వార్డు పరిధిలోని వాంబే కాలనీలోని శ్రీదేవి భూదేవి సమేత వైకుంఠ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తాళ్లపాక అన్నమాచార్య జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్నమయ్య వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు సుహాసిని ఆనంద్, ఆలయ ప్రతినిధులు మంత్రి మంజుల, దొడ్డి రమణ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు త్వరలో ఎస్‌బీఎఫ్ చెల్లింపులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగులకు త్వరలో సూపర్ యాన్యుయేషన్ బెనిఫిట్ ఫండ్ (ఎస్‌బీఎఫ్) చెల్లింపులకు మార్గం సుగమమైంది. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ ఫైనాన్స్ అధికారులు ఎస్‌బీఎఫ్ ట్రస్ట్ ప్రతినిధులకు హామీ ఇచ్చారు. ట్రస్ట్ చైర్మన్ హెచ్.కె. ఝా, కార్యదర్శి ఎస్. రామప్రసాద్ అధ్యక్షత జరిగిన ట్రస్ట్ సమావేశంలో అధికారులు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. యాజమాన్యం నుంచి ట్రస్ట్‌కు రూ. 163 కోట్లు రావాల్సి ఉండగా ఇటీవల రూ. 35.5 కోట్లు చెల్లించిదన్నారు. ఆ మొత్తాన్ని ఏప్రిల్ 2024 నుంచి సెప్టెంబర్ 2024 వరకు రిటైర్ అయిన ఉద్యోగులకు 7.25 వడ్డీతో ఎస్‌బీఎఫ్ ప్రొవైడర్‌కు చెల్లించడానికి నిర్ణయం తీసుకున్నారని ట్రస్ట్ ప్రతినిధులు డి. దేముడు, తిరుపతిరాజు, సత్యనారాయణ మూర్తి, శ్రీనివాసరావు తెలిపారు.

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో కంకణధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేంపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

ముగిసిన చందనం అరగదీత



చందనాన్ని అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం : సింహగిరిపై రెండో విడత చందనం అరగదీత శుక్రవారంతో ముగిసింది. ఈనెల 12న వైశాఖ పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీ వరాహలక్ష్మీనృసింహస్వామికి సమర్పించే మూడు మణుగుల పచ్చి చందనాన్ని (సుమారు 125కిలోలు) మూడురోజుల్లోనే సిబ్బంది అరగదీశారు. ఈనెల 12న చందనాన్ని స్వామికి సమర్పిస్తారు.

జేఎస్‌ఎస్‌లో ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మద్దిలపాలెం: స్థానిక జన శిక్షణ సంస్థాన్(జేఎస్ఎస్)లో స్వల్పకాలిక సమ్మర్ క్రాష్ కోర్సులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ సీహెచ్.అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. సమ్మర్ క్రాష్ కోర్సుల జాబితాలో భాగంగా బ్యూటీషియన్ 3 నెలలు, డ్రెస్ మేకింగ్ 3 నెలలు, అడ్వాన్స్‌డ్ టైలరింగ్ కోర్సు ఒక నెల, డీటీపీ (డెస్క్ టాప్ పబ్లిషింగ్) 3 నెలలు, ఫొటోషాప్ 3 నెలలు, ప్రీ-స్కూల్ టీచర్ ట్రైనింగ్ 6 నెలలు, స్పోకెన్ ఇంగ్లిష్ 3 నెలలు, ఎం.ఎస్. ఆఫీస్ ఒక నెల, అకౌంటింగ్ ప్యాకేజీ ఒక నెల, ఫ్యాబ్రిక్ పెయింటింగ్ 15 రోజులు, అగరబత్తి తయారీ వారం రోజులు, జ్యూట్ బ్యాగ్‌ల తయారీ 10 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఉంటుందన్నారు.

రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న యువరాజ్ ఫౌండేషన్ ప్రతినిధి

గాజువాక: యువరాజ్‌సింగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాజువాకలోని మహిళా న్యాయవాదులకు శుక్రవారం రొమ్ము క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులను నిర్వహించారు. గాజువాక కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన శిబిరంలో స్క్రీనింగ్ పరీక్షలతోపాటు మహిళా న్యాయవాదులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. ప్రస్తుత పరిస్థితుల్లో రొమ్ము క్యాన్సర్ మహిళలను వేధిస్తోందని, అవగాహన కలిగి ఉండడం ద్వారా ఆ మహమ్మారి బారి నుంచి రక్షించుకోవచ్చని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో 8వ జిల్లా జడ్జి కె.కవిత, న్యాయమూర్తులు ఎం.బి. శేషమ్మ, యార్లగడ్డ శ్రీలక్ష్మి, గాజువాక న్యాయవాదుల సంఘం యశోధర వేదమణి, ఏపీపీ తిరుమలమ్మ, సీనియర్ న్యాయవాదులు సూర్యకళ, కనక మహాలక్ష్మి, పి.మాధవి, ఉషారాణి, వెంకట లక్ష్మి, ఫౌండేషన్ ప్రతినిధులు పి.మాధురి, పి.మధు వర్షిణి, చరిత, డి.తేజశ్వి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా వెలుగులోకి..



సంఘీభావ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ సైనికులు

పెదగంట్యాడ: ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేయడం హర్షణీయమని బీజేపీ, బీఎంఎస్, ఆర్.ఎస్.ఎస్, మాజీ సైనికులు అన్నారు. పహల్గాం ఉగ్రదాడికి ప్రతి చర్యగా భారత ప్రభుత్వం ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిన నేపథ్యంలో పెదగంట్యాడలో శుక్రవారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత సైన్యం సత్తా చాటిందన్నారు. అనంతరం జాతీయ జెండాలను చేతపట్టి భరతమాత గొప్పదనాన్ని చాటుతూ పురవీధుల్లో ప్రచారం చేశారు. కార్యక్రమంలో జీలకర్ర రమణ, జీలకర్ర భువనేశ్వరి, మద్దు తుల సీదాస్, పులి అప్పలరెడ్డి, వరలక్ష్మి, సుంకర రవికుమార్, ప్రసాద్, అప్పలరాజు, తాతారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ వినియోగదారుల సమస్యలపై వినతుల స్వీకరణ



వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ సత్యనారాయణ

గాజువాక: విద్యుత్ వినియోగదారుల సమస్యలు, పరిష్కారంపై ఈపీడీసీఎల్ జోన్-2 అధికారులు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక (సీజీఆర్‌ఎఫ్) ఆధ్వర్యంలో గాజువాక సెక్షన్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వేదిక చైర్మన్ బి.సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ వినియోగదారులతో నేరుగా మాట్లాడారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం, మీటర్లలో లోపాలు, కాలిపోయిన మీటర్లు, ఓల్టేజీ హెచ్చుతగ్గులు, సర్వీస్ లోపాలు, కనెక్షన్ల మార్పు, కొత్త కనెక్షన్ల జారీలో జాప్యం, రీకనెక్షన్ సమస్యలు, బిల్లుల్లో తప్పులపై ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్యలపై వివరణ ఇచ్చారు. వినియోగదారులకు సత్వర సేవలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, వినియోగదారులు నేరుగా సీజీఆర్‌ఎఫ్‌కు ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ వింగ్ సభ్యులు సులేఖరాణి, ఫైనాన్స్ సభ్యుడు ఎస్.సుబ్బారావు, ఇండిపెండెంట్ సభ్యుడు ఎస్.మురళీకృష్ణ, ఈఈ బి.కె.నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల డిమాండ్లు పరిష్కరించాలి



మాట్లాడుతున్న పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గోపీనాథ్ తదితరులు

సబ్బవరం: త్వరలో జరగబోయే ఉపాధ్యాయుల బదిలీలు మాన్యువల్ పద్ధతిలో నిర్వహించాలని, ఏజెన్సీ ప్రాంతాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులను మైదాన ప్రాంతానికి బదిలీ చేయాలని పీఆర్‌టీయూ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డి. గోపీనాథ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సబ్బవరంలోని విద్యావనరుల కేంద్రంలో శుక్రవారం తమ యూనియన్ సభ్యులతో కలిసి ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. అదేవిధంగా రిటైర్మెంట్‌కు మూడేళ్లలోపు సర్వీస్ ఉన్నటువంటి ఉపాధ్యాయులను బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఉన్నత పాఠశాలలో 1:40 నిష్పత్తిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులు ఉంటే ఇద్దరు ఉపాధ్యాయులను తప్పనిసరిగా నియమించాలన్నారు.

తాగునీరు వృథా పట్టదా?



రాసాలమ్మకాలనీలోని వాటర్ ట్యాంక్



ట్యాంకు దిగువభాగంలో లీకవుతున్న వాటర్



రాజీవ్‌నగర్ ఫేజ్ -1లో రోడ్డు మీద ప్రవహిస్తున్న తాగునీరు

కూర్మన్నపాలెం: ఒకవైపు వేసవి మండుతోంది. గుక్కెడు మంచినీళ్లకోసం ప్రజలు అర్రులు చాస్తున్నారు. అయినా అధికారులు అప్రమత్తం కావడం లేదు. కాలనీలకు నీరు అందించే ట్యాంకుల వద్ద లీకుల ఏర్పడి వృథాగా పోతున్నా పట్టించుకోవడం లేదు. ఇందుకు రాజీవ్‌నగర్,రాసాలమ్మకాలనీలలో ట్యాంకుల వద్ద నీరు రోడ్లమీదకు పారుతున్న దృశ్యాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. రాసాలమ్మకోలనీలో భారీ వాటర్ ట్యాంకు నిర్మించారు. అక్కడి నుంచి కుళాయిలకు నిర్దేశించిన సమయాల్లో మంచినీటిని విడుదల చేస్తున్నారు. ఆ వచ్చే నీటినే ప్రజలు పొదుపుగా వాడుకుంటూ తమ అవసరాలను తీర్చుకుంటున్నారు.

కొంతకాలంగా లీకవుతున్నా..

అయితే ట్యాంకు వద్ద నీరు కొంత కాలంగా వృథాగా పోతుంది. ట్యాంకు కింది భాగంలో ఏకధారగా నీరు పారుతూ మురుగుకాలువలో కలిసిపోతుంది. దీన్ని అరికట్టాలని ఆ ప్రాంత ప్రజలు విజ్ఞప్తి చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

రాజీవ్‌నగర్ ఫేజ్ 1లో ...

రాజీవ్‌నగర్ ఫేజ్ 1లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. ఏవీఎం స్కూల్ ప్రాంతంలో నీరు వృథాగా పోతుంది. 25 రోజుల కిందట ఆ ప్రాంతీయులు లీకులను అరికట్టాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీరు వృథా కాకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

రండి .. భాగస్వాములు కండి

- రైల్ ప్రయాణికులకు వాటర్ పంపిణీలో పాల్గొవాలని పిలుపు
- పది రోజుల్లో 4400 బాటిళ్ల పంపిణీ



ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లోని సాధారణ బోగీల ప్రయాణికులకు మినరల్ వాటర్ బాటిళ్లు అందిస్తున్న చిన్నారి హిమజ

అగనంపూడి: వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకొని స్వచ్ఛంద సంస్థలు, ప్రజా సంఘాల సహకారంతో జూన్ మూడో వారం వరకు చేపట్టనున్న మినరల్ వాటర్ పంపిణీలో సంస్థలు, వ్యక్తులు భాగస్వాములు కావాలని మానవతా ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, తూర్పు కోస్తా రైల్వే జోనల్ కన్సల్టెన్సీ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్ కోరారు. దువ్వాడలో వారు మాట్లాడుతూ మధ్యాహ్నం వేళలో సాధారణ బోగీలు, మహిళలు, దివ్యాంగుల బోగీల ప్రయాణికులకు రోజూ 500 మినరల వాటర్ బాటిళ్ల పంపిణీ చేయాలని సంకల్పించామని తెలిపారు. పది రోజులుగా కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగిస్తున్నామని, ఎవరైనా దాతలు మినరల్ వాటర్ బాటిళ్లను ఉచితంగా అందివ్వాలని సంకల్పిస్తే బాటిల్‌కు రూ.7 వంతున 500 మినరల్ వాటర్ బాటిళ్లకు రూ.3500 వ్యయం చేస్తే సరిపోతుందని పేర్కొన్నారు. వ్యక్తుల, సంస్థలు నేరుగా కార్యక్రమంలో పాలుపంచుకోవాలని అనుకుంటే 89850 80595, 98499 93487 నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

4400 బాటిళ్ల పంపిణీ

పదిరోజుల వ్యవధిలో మానవ వికాస వేదిక, దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్, మానవతా స్వచ్ఛంద సంస్థ, లయన్స్‌క్లబ్, సత్యసాయి సేవా సమితి, స్పందన చేయూత ఫౌండేషన్, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ వంటి సంస్థల సహకారంతో 4400 మినరల్ వాటర్‌బాటిళ్లు పంపిణీ చేసినట్టు సంస్థల ప్రతినిధులు ఎంఎస్.ఎస్.మూర్తి, కె.ఈశ్వర్‌లు తెలిపారు. పదో రోజు పంపిణీ కార్యక్రమంలో జాషువ, ఆదిల్ రెహ్మాన్, శ్రీనివాస్, సుందర్‌మూర్తి, హిమజ, నాగేశ్వరావు, బాలలు, వయోవృద్ధులు పాల్గొన్నారు.

మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు

విశాఖ విద్య: పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆంధ్రా యూనివర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ చిట్టిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఏయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యూజీ, పీజీ పరీక్షల్లో కొంతమంది విద్యార్థులు అనైతికమైన చర్యలకు పాల్పడటం, మాల్ ప్రాక్టీస్ చేసినట్లు వర్సిటీ అధికారుల దృష్టికి వచ్చిందన్నారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడిన విద్యార్థులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏయూ పరీక్షలకు సంబంధించిన నియమావళికి అనుగుణంగా త్వరలో చర్యలు తీసుకుంటామన్నారు. ఏయూ పరిధిలో కొద్ది రోజులుగా జరుగుతున్న పరీక్షలను ప్రత్యేకంగా నియమించిన తనిఖీ బృందాలు, ప్రత్యేక పరిశీలకులు నిరంతరం పర్యవేక్షణ, పరిశీలన చేసి పరీక్షా కేంద్రాల్లో కొంతమంది విద్యార్థులు చీటీలు పెట్టి రాయడం, పుస్తకాల్లో చూసి రాయడం , మొబైల్ ఫోన్‌లో చూసి రాయడం వంటి చర్యలకు పాల్పడడాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు.

సేవకులకు ఎల్లప్పుడూ గుర్తింపు



రమణారెడ్డిని సత్కరిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: షిర్డీసాయి సేవా సమితి, పాత అగనంపూడి రామాలయ అభివృద్ధిలో కీలక భూమి పోషించిన కొయ్య రమణారెడ్డి కాళోజీ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలుగు వెలుగు జాతీయ వేదిక సంయుక్తంగా ప్రకటించిన మహానంది పురస్కారం అందుకున్నారు. ఈమేరకు అగనంపూడికి చెందిన ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. అగనంపూడి షిర్డీసాయి మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా బూత్ కమిటీల అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ), గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు మాట్లాడుతూ షిర్డీసాయి మందిరం కమిటీ అధ్యక్షుడిగా మూడు దశాబ్దాలుగా సేవలు అందిస్తుండడంతోపాటు ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. అలాగే పేదలకు అన్నదానం, ఉచిత వైద్య శిబిరాలు వంటి సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటూ అగనంపూడిలో తనకంటూ ప్రత్యేకత చాటుకున్న రమణారెడ్డికి మహానంది పురస్కారం దక్కడం సంతోషంగా ఉందన్నారు.కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త భాస్కరభట్ల సత్య ప్రసాద్‌శర్మ, ప్రజా సంఘాల నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, నక్కా రమణ బాబు, ధర్మాల సుబ్బారావు, ధర్మాల వ్యాసశర్మ, జానకీ టీచర్, మోటూరి వెంకటరమణ, మడగల నరసింగరావు, గుదే సుశీలా గజేంద్రరావు, గెద్దాడ అప్పలరాజు, సుబ్బరావు, డి.పైడినాయుడు, ఎల్.వి.రమణ, కట్టా పైడిరాజు, మాదాసు వాసు పాల్గొన్నారు.

ఫీజులు నియంత్రించాలని డీఈవోకు వినతి



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

విశాఖ విద్య: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల యజమానులు ఇష్టానుసారంగా పెంచుతున్న ఫీజులను నియంత్రించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం డీఈవో ప్రేమ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి యు.నాగరాజు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యా హక్కు చట్టానికి తూట్లు పొడుస్తూ ముందస్తు అడ్మిషన్లు నిర్వహించడంతోపాటు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. వేసవి సెలవుల్లో కూడా బ్రిడ్జ్ కోర్సు పేరుతో తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నాయని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో స్కూళ్ల వద్ద ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పి.శేఖర్, ఉపాధ్యక్షుడు కె.కిరణ్, శంకర్ పాల్గొన్నారు.